
అన్నదాతలకు రైతు భరోసా



- వానాకాలం సాగుకు పెట్టుబడి సాయం
- జిల్లాలో 2,48,550 మంది రైతులు
- రూ.251,14,13,131 నిధులు
- ఈనెల 25 వరకు విడతల వారీగా జమ

జగిత్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలకు సాగు ఖర్చుల నిమిత్తం రైతు భరోసా పథకం నిధులను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లాలో ఈనెల 17వ తేదీన 1,79,820 మంది రైతుల ఖాతా ల్లో రూ.120,67,49,510 జమ అయ్యాయి. వానా కాలం సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కొత్తగా పట్టదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సైతం రైతుభరోసా అందిం చేందుకు సంబంధిత అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో 2,48,550 మంది రైతులకు గాను రూ.251,14,13,131 పెట్టుబడి సాయాన్ని విడతల వారీగా అందించను న్నారు. ఇదివరకు ఎకరా, రెండెకరాలు, మూడెకరాలు, ఆ తర్వాత నాలుగు ఎకరాల వరకు ఉన్న రైతులకు దశల వారీగా రైతు భరోసా జమ అయ్యేది. కానీ ప్రస్తుతం అలాంటి నిబంధన లేమీ లేకుండా రైతులందరికీ రైతు భరోసా అందిస్తామని సీఎం ప్రకటించడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● ఎకరాకు రూ.6 వేల చొప్పున జమ

చిన్న, సన్నకారు రైతులకు పంట సాగు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందిస్తున్న విషయం తెలిసిందే. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పేరుతో ఏడాదికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రెండు విడతలుగా రూ.12వేలు అందిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం వానాకాలానికి సంబంధించి రెండురోజుల నుంచి జూన్ 25 వరకు విడతల వారీగా రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం నిదులు జమ చేస్తున్నారు. కొత్తగా అర్హత పొందిన రైతుల పేర్లను రైతు భరోసా జాబితాలో చేర్చే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. వారికి ఈ నెలఖారులోగా నిదులు జమ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మండలం	రైతులు	పెట్టుబడి సాయం (రూ.లలో)
బుగ్గారం	7,331	6,85,26,365
ధర్మపురి	16,772	15,17,37,981
ఎండపల్లి	10,592	9,08,52,371
గొల్లపల్లి	17,405	16,91,21,133
పెగడపల్లి	14,804	14,20,38,927
వెల్గటూరు	10,551	9,35,52,447
బీర్‌పూర్	8,415	8,28,71,331
బీమారం	6,314	8,70,43,596
జగిత్యాల	6,026	2,98,79,183
జగిత్యాల రూరల్	18,135	15,94,92,147
కొడిమ్యాల	13,224	13,59,81,352
మల్యాల	12,239	11,96,19,396
మేడిపల్లి	9,041	10,85,81,394
సారంగపూర్	7,970	7,71,12,465
ఇబ్రహీంపట్నం	11,375	13,43,56,001
కథలాపూర్	13,939	16,60,78,141
కోరుట్ల	14,258	14,32,36,049
మల్లాపూర్	16,251	18,66,83,664
మెట్‌పల్లి	18,072	17,60,97,828
మొత్తం	2,48,550	251,14,13,131

● అందరికా...కొందరికా అన్న చర్చలు

కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగిలో నాలుగు ఎకరాల్లోపు వారికే రైతుభరోసా జమ చేసింది. దీంతో సుమారు 30శాతం మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరం అయ్యారు. ఈసారి వానాకాలంలోనైనా అందరికీ జమ చేస్తుందా లేక

- మిగతా 8లో

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ లబ్ధిదారులకు అందించారు. కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 107 మందికి రూ.10,712,412 విలువ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.10,54,000 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కల్లూర్ మాజీ సర్పంచ్ వనతడుపు అంజయ్య, అన్వర్, ముత్తయ్య, ఫహీం, నత్త రాజుకుమార్, గెల్లె గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గన్నారు.

ప్రతీకార రాజకీయాలు చేస్తున్న ముఖ్యమంత్రి

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలివేసి ప్రతికార రాజకీయాలు చేస్తున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 26 మెడికల్ కళాశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో జాతీయ వైద్య మండలి నోటీసులు జారీ చేయడం ప్రభుత్వ చేతకానితనానికి ఇదే నిదర్శనమన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందు చూపుతో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే వసతులు కల్పించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఆ పార్టీ నాయకులు ప్రగతిపై దృష్టి పెట్టకుండా ప్రతి రోజు కేసీఆర్‌ను విమర్శించడం పనిగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి మెడికల్ కళాశాలల్లో వసతుల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేష్, బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్ నాయక్, వెంకటేశ్వర్‌రావు, రిజ్వాన్, అనురాధ, చందు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

- ఆర్‌ఎస్‌ఎస్ జిల్లాసంఘ్ చాలక్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్‌చాలక్ శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్‌చాలక్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయనతో పాటు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఆవాసం ద్వారా ఉచిత ట్యూషన్ సెంటర్లు, బాల సంస్కార కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రంతో పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తామన్నారు. యువత తమ నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధికోసం ప్రయత్నించాలన్నారు. కంప్యూటర్ దశదాటి ప్రసుత్తం ఇంటలిజెన్స్ ఆర్టిఫీషియల్ యుగం నడుస్తోందని, ఆ దిశగా యువత తమ నైపుణ్యాలకు పదునుపెట్టాలని సూచించారు. వాల్మీకి ఆవాసం ద్వారా అందిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఆవాస ప్రధాన కార్యదర్శి నందెల్లి మదన్మోహన్‌రావు, కమిటీ సభ్యులు అశోక్‌రావు, బెజ్జంకి సంపూర్ణచారి, ఎలగందుల కైలాసం, గౌరిశెట్టి హరీష్, కోటగిరి శ్రీనివాస్, రంగు గోపాల్‌తో పాటు శిక్షణ కేంద్రం ఇంచార్జ్ సత్యం, మల్లేశం తదితరులున్నారు.

'మాస్టర్ ప్లాన్ ప్రకారం మార్కింగ్ ఇవ్వాలి'

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల, మెట్‌పల్లికి వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా మాస్టర్‌ప్లాన్ ప్రకారం మార్కింగ్ నిర్వహించాలని బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు పలు కాలనీలకు చెందిన నాయకులు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రంను అందించారు. పట్టణంలోని జాతీయరహదారిని మధ్య నుంచి వందఫీట్ల మార్కింగ్ చేసి రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని అన్నారు. నాలుగు రోజుల క్రితం జరిగిన విద్యుత్ శాఖ ప్రమాదంను పరిగణనలోకి తీసుకొని అక్రమంగా ఉన్న షెడ్‌లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీలకు చెందిన యువకులు, బీఆర్‌ఎస్ నాయకులు చిత్తరి ఆనంద్, గెల్లె గంగాధర్, బాబ, ఫహీంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ నియామకం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ పట్టణ కమిటీని పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ బుధవారం నియమించారు. ఉపాధ్యక్షులుగా ముద్దం రాము, ఠాకూర్ పవన్ సింగ్, గాదాసు రాజేందర్, ఇట్యాల రాము, ప్రధాన కార్యదర్శులు ఆముద రాజు, సిరికోండ రాజు, కార్యదర్శులుగా మేడిపెల్లి పుష్పారెడ్డి, నక్క జీవన్, గడ్డల లక్ష్మీ, వొడ్నాల మహేష్, కోశాధికారిగా మర్రిపెల్లి సాగర్, కార్యవర్గ సభ్యులుగా ఎనుగందుల గంగాధర్, తిరిపురం రాంచం ద్రం, రాగిల్ల సత్యనారాయణ, ముద్దం గంగారెడ్డి, సోమ లక్ష్మీ, కడార్ల లావణ్య లను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ అధ్వర్యంలో ఒక మార్పు అభివృద్ధికి మలుపు వందరోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మున్సిపల్ అధికారులు బుధవారం చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్వచత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తడి, పొడి, హానికరం చెత్తపై వేరుచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. పోటీ లలో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు.

సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తావద్ద బీజేపీ ఆధ్వర్యంలో సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా జాతీయశాఖ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా సంకల్ప సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని సంకల్ప సభల ద్వారా వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా కార్యదర్శి, సంకల్ప సభ జిల్లా కో కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సమీర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించగా, ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కీంకు నిధులు విడుదల చేయకపోవడంతో స్కీం ఆగిపోయే స్థితికి చేరిందని విమర్శించారు. రాష్ట్రంలో 12 ఎస్సీ గురుకుల ఇంటర్ కళాశాలలను విద్యార్థులు లేరనే నెపంతో మూసివేసే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల, కళాశాలల గుర్తింపు రద్దు చేసేలా చట్టం తేవడంతో పాటు, ఫీజులు నియంత్రణ చట్టం రూపొందించి పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ ఫీజులను ఎట్టిపరిస్థితుల్లో పెంచవద్దన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమీర్, అక్రమాలిక్, ఇతర బాధ్యులు మహేష్, నిహాల్, దిల్షాన్, పార్థు తదితరులున్నారు.

రాయికల్ లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

రాయికల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరం నూతన కార్యవర్గాన్ని బుధవరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాయవాది కొత్తపెల్లి రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొడగం అంజిరెడ్డి, కోశాధికారిగా బెక్కం తిరుపతి ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు బత్తిని భూమయ్య, మ్యాకల రమేష్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లయన్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, క్లబ్ సభ్యులు కాటిపెల్లి రాంరెడ్డి, గంప ఆనందం, దాసరి గంగాధర్, ఎద్దండి దివాకర్, కొమ్ముల ఆదిరెడ్డి, కొయ్యడి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మానాల కిషన్ తండ్రి రాజయ్య, జగిత్యాల పట్టణంలోని ప్రముఖ వైద్యుడు నారాయణలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, జలందర్ తదితరులు ఉన్నారు.

'అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి'



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజక వర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 31వ వార్డులో ఇటీవల చేపట్టిన రోడ్డు దెబ్బతినడంపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆరు నెలలకే రోడ్డు దెబ్బతినడం కాంట్రాక్టర్ చేతివాటం, అధికారుల నిర్లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణం తర్వాత క్యూరింగ్ సరిగా చేయాలని, పట్టణంలో సీసీ డ్రైనేజీలపై రోడ్ల వెడల్పు కోసం స్లాబ్‌లు వేస్తున్నామని అన్నారు. జగిత్యాల అభివృద్ధి లక్ష్యంగా తాను పని చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, అబ్బుల్ ఖాదర్, మజాహిద్, మీర్ ఖాజీం అలీ, చెట్‌పెల్లి సుధాకర్ ఉన్నారు.

ఉపాధిహామీ కూలీలకు పని కల్పించాలి

- జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్

8

ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి

- మూతపడే స్థితి నుంచి 30 మంది విద్యార్థులతో కళకళ
- బట్టపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటింటా ప్రచారం

6

స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయాలి

- బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయాలని బీజేపీ శాసనసభా పక్షనేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ 11ఏళ్లపాలన ఓ సువర్ణ అధ్యాయమని, ప్రభుత్వపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కౌండిన్య ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కేంద్ర ప్రభుత్వ 11ఏళ్ల పాలనలో సాధించిన ప్రగతిపై నేతలతో సమావేశం నిర్వహించారు. అనం తరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో మోదీ లాంటి పాలన చూడలేదని, కొందరు ఓర్వలేక కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మోదీ పాలనలో ఉగ్రవాదం, ఎమర్జెన్సీ లాంటి పరిస్థితి లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం దిశగా తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. మోదీ పహల్గాం ఉగ్రదాడి కుట్రదారులపై ఆపరేషన్ సిందూర్‌తో తగిన బుద్ధి చెప్పారన్నారు. దేశం వైపు కన్నెత్తి చూస్తే అంతు చూస్తామనే విధంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మన సైనికులు దాడిచేసి సత్తా చాటారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యిందన్నారు. 11ఏళ్ల మోదీ పాలన విజయాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సీఎం రేవంత్‌రెడ్డికి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రక్షణ వ్యవస్థను పటిష్టం చేశారని ఆయన పేర్కొ న్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలచే వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అమర్నాథ్, బీజేపీ వివిధ హోదాల బాధ్యులు గుంటుక సదాశివ్, వడ్డేపల్లి శ్రీనివాస్, కస్తూరి సత్యం, రాగిల్ల సత్యనారాయణ, నలువాల తిరుపతి, కొక్కు గంగాధర్, పిల్లి శ్రీనివాస్, దశరథరెడ్డి, ఓరుగంటి చందు, సాంబారి కళావతి, దుర్శెటి మమత, పవన్‌సింగ్, ఆముద రాజు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు'

కొడిమ్యాల, జూన్18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సీహెచ్. నరేష్, పరమేశ్వరీ ప్రజలను కోరారు. బుధవారం ఆసుపత్రిలో వైద్యులు మాట్లా డుతూ ఈ నెల 13 నుంచి 27 వరకు అతిసార వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని మండలంలోని గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్నారన్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నీళ్ల విరేచనాలు ఎవరికైనా ఉన్నట్లయితే వెంటనే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. నివారణకు ఓఆర్‌ఎస్ పాకెట్లు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుకున్నా రన్నారు. పిల్లల వయస్సు, బరువును దృష్టిలో పెట్టుకొని ఓఆర్‌ఎస్‌ను అందిస్తామన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరి 2025లో నిర్వహించిన ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

వ్యాను-కారు ఢీ

● ముగ్గురికి గాయాలు

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజి సమీపంలో బుధవారం డీసీఎం వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి మధ్యప్రదేశ్‌కు కొబ్బరి బొండాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్, కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులోని ఇద్దరికి గాయాలు కాగా రహదారి పక్కన నిలుచున్న పెగడపల్లి మండలం నందగిరికి చెందిన మనెమ్మ అనే మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. ప్రమాదంలో కారు, డీసీఎం వ్యాన్ ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం అనంతరం డీసీఎం వ్యాన్‌ను పోలీసులు రాణాకు తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెను ప్రమాదం

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ బస్సు టైరు పగిలి అదుపుతప్పిన సంఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ముంజంపల్లి గ్రామశివారులో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలంకు వెళుతోంది. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామశివారుకు రాగానే బస్సు టైరు పగిలింది. దీంతో బస్సు కుడివైపున గల మరో రోడ్డు వైపునకు దూసుకెళ్లి రేయిలింగ్‌కు ఢీకొని ఆగింది. బస్సులో 26 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఓసీపీ-3లో డీజిల్ బోజర్ బోల్తా

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో డీజిల్ బోజర్ బోల్తాపడింది. బుధవారం ప్రాజెక్టులోని క్వారీ నుంచి సర్ఫేస్‌కు వెళ్లే దారిలో డీజిల్ బోజర్ ఇంజన్ ఫెయిల్ కావడంతో దారిలో నిలిచిపోయింది. సుమారు 3వేల లీటర్ల డీజిల్‌తో ఉన్న బోజర్‌నుపార్కింగ్ స్థలానికి గ్రేడర్‌సహాయంతో తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో బోజర్‌లో డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు ఉన్నారు. ఇద్దరు కార్మికులు వాహనంనుంచి దూకగా, బోజర్‌లో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కండీషన్ సరిగాలేని వాహనం కారణంగా ప్రమాదం జరిగినట్లు కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి.

యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక సుధాకర్(28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం మేరకు సుధాకర్ అదే గ్రామానికి చెందిన అపూర్వ అనే యువతిని రెండు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున సుధాకర్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి

● మూతపడే స్థితి నుంచి 30 మంది విద్యార్థులతో కళకళ ● బట్టపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటింటా ప్రచారం

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మూతపడే స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి పోసాడు ఓ ఉపాధ్యాయుడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండేవారు. దీంతో విద్యార్థులను పక్క గ్రామంలో గల పాఠశాలకు పంపి బడిని మూసి వేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో బట్టపల్లి ఉపాధ్యాయుడు సుధాకర్ ఎలాగైనా బడిని బతికించాలని కంకణం కట్టుకున్నాడు. గ్రామంలో విద్యార్థుల ఇంటింటికీ తిరిగి పోషకులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన ఉంటుందని, పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తారని ప్రభుత్వ పరంగా వచ్చే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాడు. దీంతో గ్రామంలోని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం



బట్టపల్లి పాఠశాలలో విద్యార్థులతో పోషకులు, ఉపాధ్యాయుడు

బట్టపల్లి ప్రభుత్వ పాఠశాల 30 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పోషకుల్లో ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కల్పించాం

సుధాకర్, బట్టపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు



ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాం. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని భరోసా ఇచ్చాం. ప్రభుత్వ బడుల్లో చదివితే విద్యార్థులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో అవగాహన కల్పించాం. దీంతో 30 మంది విద్యార్థులను పాఠశాలకు పంపిస్తున్నారు.

నా ఇద్దరు పిల్లలను చేర్పించా

అర్రె ప్రేమానందం, పోషకుడు, బట్టపల్లి గ్రామం



నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నా. మా గ్రామంలో అందరూ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో ఊరిలోని ప్రభుత్వ పాఠశాల మూత పడే పరిస్థితి వచ్చింది. దీంతో ఎలాగైనా పాఠశాలను బతికించాలని గ్రామంలోని తల్లి దండ్రులం సమష్టి నిర్ణయంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం.

ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న పోడు రైతులు

● వెనుదిరిగిన అటవీశాఖ అధికారులు

వీర్నపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు ప్లాంటేషన్ కోసం సర్వేచేయడం సరికాదని పోడురైతులు మండిపడ్డారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 20సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడుభూముల్లో మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు బుధవారం సర్వేచేపట్టారు. విషయం తెలుసుకున్న అన్నికులాల రైతులు అక్కడికి చేరుకొని మొక్కలు నాటొద్దని అధికారులను వేడుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2005సంవత్సరం తర్వాత ఆక్రమణకు గురైన అటవీభూమిలో ప్లాంటేషన్ కోసం సర్వే చేస్తున్నామని అటవీశాఖ సెక్షన్ అధికారి పద్మలత రైతులకు వివరించారు. పోడుపట్టాల కోసం ప్రభుత్వాలను వేడుకుంటున్నామని ఏళ్లక్రితం సాగుచేసిన భూములను అధికారులు సర్వే చేయ డం సరికాదన్నారు.



సర్వేను అడ్డుకుంటున్న పోడు రైతులు

అధికారులు సర్వేను ఆపకపోతే పురుగుల మందు తాగే పరిస్థితి వస్తుందని రైతులు పేర్కొన్నారు. అక్కడి నుంచి రైతులను పంపించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నించినా వినకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

గౌరెడ్డిపేటలో దొంగల బీభత్సం

● మంగళసూత్రం ఎత్తుకెళ్లిన దుండగులు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్

పెద్దపల్లి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు, పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన సొన్నాయి టంకం లక్ష్మీ రాత్రి నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మెడలోఉన్న 20గ్రాముల మంగళసూత్రం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లినట్లు తెలుపుతున్నారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ చేరుకుని డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేయించారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన యువతి(22) మంగళవారం అదృశ్యం అయ్యింది. యువతి తనఇంటి నుంచి మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. యువతి తండ్రి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు బుధవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యా లయ సమీపంలో పాత పగలు మనసులో పెట్టుకుని ప్రవీణ్ అనే యువకుడిపై పురుషోత్తం అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పురుషోత్తంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణపోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్‌తీగలకు తగిలి కిందపడిన నెమలి

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీపరిధిలోని లక్ష్మీపూర్‌లో జాతీయపక్షి నెమలి బుధవారం ఇళ్లలోకి వచ్చి విద్యుత్ తీగలకు తగిలి కిందపడిపోయింది. అస్వస్థతకు గురవడంతో గమనించిన స్థానికులు నెమలిని చేరదీసి పోలీసులకు సమా చారం అందించారు. అనంతరం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

ఫిట్‌నెస్‌లేని బస్సు సీజ్

తిమ్మాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ఓవిద్యాసంస్థ బస్సును బుధవారం నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. విద్యాసంస్థలు ప్రారంభం అయినప్పటికీ కొన్నివిద్యాసంస్థలు బస్సులను ఇంకా ఫిట్‌నెస్ చేసుకోలేదన్నారు. వాటిపై ప్రత్యేక తనిఖీలుచేపట్టి సంబంధితవిద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

శంకరపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో ఓవ్యక్తి మద్యానికి బానిసై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి వీరస్వామి(45) కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చేవాడు. రోజూ లాగానే బుధవారం కూడా తాగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కూతురు ఇంట్లోకి వెళ్లి చూడగా తండ్రి ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె అరుస్తూ చుట్టు పక్కల వాళ్లను పిలిచి కిందకు దించగా అప్పటికే వీరస్వామి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవపరీక్షకోసం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల మొగిలయ్య(78) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాళ్ల నొప్పులు భరించలేక ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టుకు చెందిన కదురుక గంగరాజం(59) అనేవ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. కొండగట్టుకుచెందిన కదురుక గంగరాజం కొంత కాలంగా కాళ్లకు తీవ్రబొబ్బలు వచ్చి నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో నొప్పిభరించలేక బుధవారం మధ్యాహ్నం ఘాట్‌రోడ్డు మధ్యల గుట్ట సమీపంలో క్రిమిసంహారక మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులుగమనించి 108లో చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నకిరేకల్‌కి చెందిన శివరాత్రి సైదులు హుజూరాబాద్‌లో బావులు తవ్వుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంట్లో కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో విరక్తి చెందిన సైదులు బోర్నపల్లి కాకతీయకాలువలో దూకాడు. కాలువలో నీరు లేకపోవడంతో ప్రాణా పాయం తప్పింది. గమనించిన స్థానికులు, అగ్నిమాపకసిబ్బంది సైదులును కాలువలోనుంచి బయటకుతీసి 108లో హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో ఈనెల10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుగ్గిళ్ల అరుణ్‌కుమార్(22) అనేయువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల బాలరాజు చిన్నకుమారుడు అరుణ్‌కుమార్‌తోపాటు మరో యువకుడు రాజు సిరిసిల్ల నుంచి వేములవాడకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రగుడు శివారులో కారుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన అరుణ్‌కుమార్ హైదరాబాద్‌లో వారంరోజులుగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు.



అరుణ్‌కుమార్(ఫైల్)

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

గంగాధర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన వృద్ధుడు చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం.. గ్రామానికిచెందిన రేండ్ల రామస్వామి(74) కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పి, మోకాళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. ఎన్నిఆస్పత్రుల్లో చూపించినా ఉపశమనం లేకపోవ డంతో తీవ్రమనస్థాపానికిగురై జీవితంపై విరక్తితో ఈనెల16న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఈనెల17న మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి

● ఇచ్చిన హామీలు అమలుచేసే శక్తినివ్వాలని కోరా



శ్రీవారి ఆలయం ఆవరణలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసే శక్తినివ్వాలని శ్రీవారిని కోరుకున్నట్లు మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర క్యాబినేట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. ఆరు గ్యారెంటీల పథకాలకు శ్రీవారు, అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రిగా తనకు ధైర్యాన్ని, ఆశీర్వాదాన్ని ప్రసాదించాలని కోరుకున్నట్లు చెప్పారు. సామాన్య పార్టీ కార్యకర్తగా ఉండే తనకు మంత్రిగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

ఝాన్సీలక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం అని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీకౌన్సిలర్ ఏసీఎస్ రాజు అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ యుద్ధసమయంలో ఝాన్సీలక్ష్మీబాయి చూపిన తెగువ, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో సంఘబాధ్యులు అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, నారెందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, వేముల పోచమల్లు, ఎద్మల వెంకటరెడ్డి, మల్లిఖార్జున్, రాజేశ్వర్‌రావు, విఠల్, బాలన్న, రాపర్తి రవి, వీరన్న, భూమన్న, శ్రీనివాస్, అంజన్న, గంగాధర్, రామచంద్రం, నరేందర్, అశోక్ తదితరులున్నారు.

కారు బీభత్సం..

● ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కారు బీభత్సం సృష్టించడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల వేములవాడ మండలం రుద్రవరం, ఆరెపల్లి గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ కారు(టీఎస్08 జీజే8526)లో వేములవాడ నుంచి మద్యం సేవించి అతివేగంగా కరీంనగర్ వైపు వెళుతూ రుద్రవరం గ్రామ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న దర్శి(35) అనే కార్మికుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ఆగకుండా అదే అతివేగంతో వెళ్లి పక్కనున్న ఆరెపల్లి గ్రామంలో ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి వస్తున్న వేములవాడ పట్టణానికి మల్యాల పండరీనాథ్(72), అతడి మిత్రుడు చందులను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పండరీనాథ్ అక్కడికక్కడే మృతిచెందగా, చందు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఒకరు పరారీలో ఉండగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన జరిగిన తీరును పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుల్లో దర్శి స్థానిక ఇటుక బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. దర్శి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు అని స్థానికులు చెబుతున్నారు.



పండరీనాథ్(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కారు

133.8 కిలోల గంజాయిని దహనం చేసిన పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన 133.8 కిలోల నిషేధిత గంజాయిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డ్రగ్‌డిస్పోజల్ కమిటీ సమక్షంలో బుధవారం దహనం చేశారు. మానకొండూర్ మండలం ఈదుల గట్టెపల్లిలోని వెంకటరమణ ఇన్సినేటర్‌లో నిబంధనల మేరకు దహనం చేసినట్లు అధికారుల తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు వేణుగోపాల్, విజయ్ కుమార్, సీఐలు పుల్లయ్య, సంజీవ్, రజనీకాంత్, ఇన్సినేటర్ ప్లాంట్‌కు చెందిన ప్రతినిధి తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయిని సీపీ గౌస్ ఆలం సమక్షంలో ఇన్సినేటర్‌లో దహనం చేస్తున్న పోలీసులు

వృద్ధురాలి మెడలోని బంగారం చోరీ

మంథనిరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ చేశాడు. ధర్మారం గ్రామంలో కందుకూరి లక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున సుమారు 3గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండున్న తులాల బంగారం తాడును ఎత్తుకెళ్లాడు. లక్ష్మి భర్త, కుమారులు మరణించారు. పోలీసులకు సమాచారం అందించగా గ్రామంలో విచారణ చేపట్టారు.

గంజాయి పట్టివేత



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద కిలో 180 గ్రాముల గంజాయిని బుధవారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికిచెందిన కొంటు అనిల్‌కుమార్, సుభాష్‌నగర్‌కుచెందిన నీర్ల వంశీకృష్ణ వద్ద గంజాయి పట్టుబడిందని, వారిద్దరిని అరెస్టుచేశామని పేర్కొన్నారు. నిందితులు ఇద్దరుకొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డారని, ఎలాగైనా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొస్తుండగా కరీంనగర్ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఎస్సైలు రాజన్న, శేఖర్, భాస్కర్‌రెడ్డి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం తీగలగుట్టపల్లి వద్ద బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్ యజమాని కోండ్ర కృష్ణపై కేసునమోదు చేసినట్లు, కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కొత్తపల్లిమండలం చింతకుంటవద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒకట్రాక్టర్‌ను కొత్తపల్లిపోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌డ్రైవర్‌పై కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మానకొండూర్‌లో నాలుగు ట్రాక్టర్ల పట్టివేత

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి మానకొండూర్ గ్రామశివారులో పట్టుకొని ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐతెలిపారు.

ఎస్సారార్‌లో కొత్తగా బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ డిగ్రీ కోర్సు


గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) 2025-26 విద్యాసంవత్సరం నుంచి బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ అనే కొత్త డిగ్రీ కోర్సు పెట్టనున్నారు. దోస్త్ రెండో విడతలో అనుమతి లభించినట్లు, 60 సీట్లతో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఏ గ్రూపు చదివినా కోర్సుకు అర్హులని తెలిపారు. కోర్సుతో విద్యార్థులకు రిటైల్ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. వివరాలకు 98665714 41, 9959 838049, 8341858459నంబర్లలోగానీ, కళాశాల దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ-సీఎస్ఏటీ-2025 (సివిల్ సర్వీసెస్ పరీక్ష) కోసం ఉచిత శిక్షణకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శాఖ ఎస్సీ స్టడీ సర్కిల్, డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. బంజారాహిల్స్ హైదరాబాద్‌లో శిక్షణతో భోజన వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. http://tsstudy-circle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-23546552, 8121626423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చదువుదాం.. చదివిద్దాం..



నేడు జాతీయ పఠనా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శరీరానికి వ్యాయామం ఎలా అవసరమో మనసుకు చదవడం కూడా అంతేనని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చదవడం వల్ల మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడుతుంది. ఈ దిశలో ఇంటర్‌నెట్ ఆధిపత్యం ఉన్న కాలంలో కూడా ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడానికి, అక్షరాస్యత, పుస్తకాల ప్రాధాన్యం గురించి అవగాహన పెంచడానికి ప్రతీ సంవత్సరం జూన్ 19న జాతీయ పఠన దినోత్సవాన్ని జరుపుకుంటారు. పఠన దినోత్సవం తర్వాత వారం పఠన వారంగా జరుపుకుంటారు.

పఠన దినోత్సవం పుట్టిందిలా..

కేరళలో గ్రంథాలయ, అక్షరాస్యతా ఉద్యమ పితామహుడు పుతువాయిల్ నారాయణ పనికర్ (ఉపాధ్యా యుడు) గౌరవార్థం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దేశంలో అక్షరాస్యత, విద్యను ప్రోత్సహించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. వ్యక్తులు, సమాజం పురోగతిని, అభివృద్ధిని సాధించాలంటే పుస్తకాల ద్వారా విద్యను పొందడం చాలా అవసరమని విశ్వసించారు. 1945 లో కేరళలో తొలి ప్రజా గ్రంథాలయాన్ని స్థాపించారు.

చదవడం వల్ల ప్రయోజనాలు

చదవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడుతాయి. కొత్త సమాచారం కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. రచనల పఠన, లిఖనం అలవాటు పెంచుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. 30 నిముషాలు చదవడంతో హృదయస్పందన రేటు, రక్తపోటు, మానసిక క్షోభ భావనలు తగ్గుతాయి, నిరాశ, మానసిక రుగ్మతలు నశిస్తాయి. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి విస్తృత శ్రేణి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాలను అన్వేషించడానికి, ప్రపంచం గురించి లోతైన అవగాహన పొందడానికి వీలు కలుగుతుంది.

గ్రంథాలయాల పాత్ర కీలకం..

చదవులో మన ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలతో పాటు గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రంథాలయాల్లో మనకు కావాల్సిన పుస్తకాలు లభిస్తాయి. అక్కడే కాకుండా ఇంటికి పుస్తకాలు తెచ్చుకుని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు.



చదువుతో విజ్ఞానం.. వికాసం
సత్తు మల్లేశం, గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు వివిధ రకాల కొత్త పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పిస్తున్నాం. వసతులను మెరుగుపరిచే దిశలో ఉన్నాం. పాఠకుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

రోజు కొంతసేపైనా చదువుతా..
అన్నవరం దేవేందర్, కవి, రచయిత



రోజూ కొంతసేపైనా చదువనిదే నాకు పొద్దు పోదు. రచయితలు ఇతర రచనలు చదివితేనే వారి సృజనాత్మకత, రచనాశక్తికి పదును పెట్టవచ్చు. పిల్లల నుంచి పెద్దవారి వరకు ఎంతో కొంత సేపు చదవడం నిత్య కృత్యం చేసుకోవాలి.

మానసిక ప్రశాంతత లభిస్తుంది
శ్రీవత్స, విద్యార్థి



నా పాఠ్య పుస్తకాలతో పాటు దిన పత్రిక, ఇతర కథలు, సైన్స్ పుస్తకాలు రోజూ చదువుతాను. ఇలా కొంత సేపైనా చదవడంతో సెల్ ఫోన్, టీవీకి దూరంగా ఉండగలుగుతున్నాను. మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది.

ముల్కనూర్ బ్యాంకు ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ ఏకగ్రీవం

ధ్రువీకరణ పత్రాన్ని అందించిన ఎన్నికల అధికారి



ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు

భీమదేవరపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్యానల్‌కు సంబంధించి ఐదుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు. ఒకటో వార్డు నుంచి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రెండో వార్డు నుంచి బొల్లంపల్లి కుమారస్వామి, ఐదో వార్డు నుంచి జి శ్రీనివాస్, తొమ్మిదో వార్డు నుంచి గుర్రాల భాస్కర్‌రెడ్డి, 15వ వార్డు నుంచి కాశిరెడ్డి వసంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి కోదండరాములు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఎన్నికల సహాయ అధికారి రవీంద్ర, లోన్ సెక్షన్ మేనేజర్ జి రాజమౌళి, వెంకటేశ్వర్‌రావు, సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే ఏకగ్రీవ ఎన్నిక
అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్

ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో నా ప్యానల్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా గెలిపించినందుకు రైతులకు కృతజ్ఞతలు. ఏకగ్రీవ ఎన్నిక కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. రైతుల సంక్షేమం, వారికి సకాలంలో రుణాలు ఇస్తాము. ముల్కనూర్ బ్యాంకు సభ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘాల మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదింపజేయడం హర్షణీయం అయినప్పటికీ ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదింప జేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తిరుపురం రామచంద్రం, రాచకొండ రోజా ఎలుక బగవాన్, దండుగుల హృషికేష్, అనుమల్ల సంజయ్ స్వామ్రాట్, పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎం ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎంఫార్మసీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం యూని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana. ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

డంప్ యార్డు తరలించాలని నిరసన



ఇంటింటికీ పోస్టర్ అంటిస్తూ నిరసన తెలుపుతున్న కాలనీ మహిళలు

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని డంప్‌యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ అలకాపురి కాలనీ మహిళలు బుధవారం 'ఓటు కాదు.. మాకు ఊపిరి కావాలి' అనే పోస్టర్లను ఇళ్లకు అంటించి వినూత్న నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంప్ యార్డు పొగతో ఇబ్బందులు పడుతున్నామని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నామని, ఆసుపత్రుల పాలవుతున్నామని వాపోయారు. డంప్ యార్డును తరలించాలని ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తులు చేశామని, హామీగానీ, చర్యలు గానీ లేవన్నారు. రానున్న ఎన్నికల్లో తాము ఓటు హక్కును వినియోగించు కోవద్దని నిర్ణయించుకున్నామని తెలిపారు. డంప్‌యార్డును తరలిపు హామీ ఇవ్వాలన్నారు. మునిపల్లి పణీత, సరళ, భాగ్యలక్ష్మి, శోభ, శ్యామల, సుమతి, అన్నపూర్ణ, శ్రీలత, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



పూసాలలో బోనాలతో మహిళలు

సుల్తానాబాద్, జూన్ 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలలో బుధవారం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆదే విధంగా పోచమ్మ తల్లికి కూడా బోనాలు సమర్పించారు. పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గుర్రాల మల్లేశం ఆధ్వర్యంలలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే బోనాల వేడుకలలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించినట్లు మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, కార్యదర్శి కంకనాల సతీష్, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, సొసైటీ డైరక్టర్లు లక్ష్మయ్య, కనకయ్య, భూతగడ్డ కనుకయ్య, లక్ష్మీనారాయణ, రవి,శ్రీను, కంకణాల అశాలు, ఉస్తెం రవి, సిద్ధ తిరుపతి గుర్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● **కమాన్‌పూర్** : మండలంలోని జూలపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి బోనాలు బుధవారం అంగరంగ వైభవంగా ముదిరాజ్ కులస్థులు నిర్వహించారు. ప్రతి వర్షాకాలం ముందు గ్రామంలో డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి బోనాలు సమర్పిస్తారు. ఈ యేడు వర్షాలు సంమృద్ధిగా కురిసి పాడి, పంటలు పండాలని అమ్మవారికి మెక్కులు చెల్లించుకున్నారు.



జూలపల్లిలో బోనాలతో గీత కార్మికులు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయె



● రాష్ట్ర వ్యాప్తంగా 8 యూనివర్సిటీల్లో దరఖాస్తుకు షెడ్యుల్ విడుదల ● జూలై 17 వరకు తుదిగడువు

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రఖ్యాత ఎనిమిది యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 (టీజీపీసీజీఈటీ-2025)గా పిలుస్తారు. జూన్ 18 నుంచి జూలై 17 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులందరూ తమకు ఇష్టమైన సబ్జెక్టుల్లో పీజీ కోర్సులను అభ్యసించవచ్చు.

మీ కోసం...

ఎనిమిది వర్సిటీలకు ఒకే దరఖాస్తు

రాష్ట్రంలోని అన్ని ప్రధాన వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ఉస్మానియా వర్సిటీయే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో ఏ వర్సిటీకి ఆ వర్సిటీ ప్రవేశ పరీక్షను నిర్వహించేవారు. కొన్నేళ్లుగా ఉస్మానియా వర్సిటీ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, వరంగల్ కాకతీయ, నిజామాబాద్ తెలంగాణ, నల్లగొండ మహాత్మాగాంధీ, మహబూబ్నగర్‌లోని పాలమూరు, కరీంనగర్ శాతవాహన, హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలకు కామన్ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తారు.

కోర్సుల వివరాలు

పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, అరబీ, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, రాజనీతిశాస్త్రం, ఎకానమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, సోషియాలజీ, ఎంఎస్‌ఐఎస్సీ, ఎంకామ్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్ బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంఈడీతో పాటు ఇతర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. వీటితోపాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంబీఏతో పాటు ఇతర కోర్సులు ఉన్నాయి.

కంప్యూటర్ పరీక్ష

కంప్యూటర్ బేస్ట్ పరీక్ష (సీబీటీ) నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల్లో డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నాలు ఉంటాయి. మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అపరాధ రుసుంతో గడువు

జూలై 24 వరకు రూ.500 అపరాధ రుసుము తోనూ, జూలై 28వ తేదీ వరకు రూ.2వేల అపరాధ రుసుముతోనూ దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. జూన్ 24 వరకు గడువు విధించారు.

దరఖాస్తుకు వెబ్‌సైట్‌లు

https://www.osmania.ac.in/cpget.tsche.ac.in 2025లో దరఖాస్తులు సమర్పించాలి. నిర్ణీత ఫీజులను చెల్లించాలి. హాల్ టికెట్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. కోర్సులు, ఫీజులు, హాస్టల్ వసతితోపాటు సమగ్ర వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.





వెండిపతకం సాధించిన కూనకిషన్

జాతీయ అర్చరీలో ఆర్టీసీ ఉద్యోగికి వెండిపతకం

భగత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ కరీంనగర్ ఉద్యోగి కూన కిషన్ వెండి పతకం సాధించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన అర్చరీ జాతీయ స్థాయి పోటీల్లో 50 మీటర్లలో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా కిషన్‌ను ఆర్టీసీ వర్క్ షాపు వర్క్ మేనేజర్ ప్రణీత్, అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాసరావు, సురేందర్, ఎంఎఫ్ నందు, సూపర్ వైజర్స్ అభినందించారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో జ్యేష్ఠాభిషేకం

108 కళశాలతో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం జ్యేష్ఠాభిషేకాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వ హించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు తదితరులు ఉన్నారు.

సంతలో ట్రాఫిక్ చింత

వెల్గటూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, వివిధ రకాల వస్తువులు, బట్టలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇరువైపులా చిరు వ్యాపారులు కొట్లు ఏర్పాటు చేసుకోవడంతో రోడ్డు కొంత ఇరుకుగా మారుతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనితో కూరగాయలు తదితరాలు కొనుక్కోవడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత రోజు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా పోలీస్ సిబ్బందిని నియమించాలని ప్రజలు, వాహనదారులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.



వెల్గటూర్ సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు

నోట్ బుక్కులు పంపిణీ

కొడిమ్యాల, జూన్18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, మండలంలోని తిర్మాలాపూ ర్, రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి, హిమ్మతురావుపేట, నాచుపల్లి పాఠశాలలో బుధవారం కొండగట్టు గిరి ప్రదక్షిణ వ్యవస్థాపకుడు చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకుడు సురేష్ ఆత్మారాం ఆధ్వర్యంలో ఇటీవల పంపిన కొండగట్టు గిరి ప్రదక్షిణ నోట్ బుక్కులను విద్యార్థులకు హన్మాన్ భక్తులు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల హన్మాన్ భక్తులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

కొడిమ్యాల, జూన్18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ కె. వేణు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా కలిపిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

సారంగాపూర్, జూన్, 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన సట్టుల వివేక్ వెన్నుముక సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎసీఎం సహాయనిధి ద్వారా వివేక్ శస్త్ర చికిత్స కోసం రూ, 1.75వేల చెక్కును వివేక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోలపాక లక్ష్మీరాజం, నాయకులు మర్రిలపెల్లి రాజేశం, గంగారాజం, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దమ్మ న్నపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు మంజూరు చేసిన రూ 1,73, 500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వివిధ ఎందర్భాల్లో ప్రజలు రోగాల బారిన పడి, ప్రమాదాలు గురైన సమయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకవెళ్లినట్లు తెలిపారు. వెంటనే మంత్రి స్పందించి సీఎం సహాయ నిధి నుండి ఆర్థికసాయం మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట గ్రామపంచాయితీ కార్యదర్శి శంకర్, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

'భూ భారతితో సమస్యలు పరిష్కారం'



ధర్మపురిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ధర్మపురి ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పురపాలక సంఘం ఆవరణలో భూ భారతి రెవన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ భూమి సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్, మేనేజర్ బాలె గంగాధర్, ఆర్ఐలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, సర్వేయర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల, జూన్18(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాచుపల్లి గ్రామంలో బుధవారం భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 146దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ సభలో ఆర్ఐ కరుణాకర్, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

●పెగడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రవీందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంగళాయిపేటలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి భూ సమస్యలపై ఆర్జీలు స్వీకరించారు. సదస్సులో గిర్దావర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నాయకులు కడారి తిరుపతి, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు పని కల్పించాలి

- జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్

కోరుట్ల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం పొందేలా పని కల్పించాలని జిల్లా పంచాయతీ రాజు అధికారి మదన్‌మోహన్ మండల స్థాయి అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులు, పారిశుధ్య పనులపై మండల స్థాయి అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందించారు. ఉపాధిహామీ పనులను క్వాలిటీగా నిర్వహిస్తూ, పారిశుద్ధ్య పనులకు ఎప్పడికప్పులు సమయ స్ఫూరితో నిర్వహించే విధంగా మండల స్థాయి అధికారుల చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల నుండి వచ్చే ప్రతి దరఖాస్తు పరిశీలించి జవాబుదారిగా పని చేయ్యాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు ఎప్పడికప్పుడు పరిశీలించాలన్నారు. లబ్ధిదారులతో సమన్వయగా ఉండి ఇండ్ల నిర్మాణలు త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ వోదెల రామకృష్ణ, ఎంపీఓ కృపాకర్, ఎపిఓలు మమత, లక్ష్మణ్, ఈసీ మాస్టర్ ట్రైనర్ చిరంజీవి, కార్యధర్శులు, టీఏలు, ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు


రాయికల్‌లో పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను బుధవారం మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించారు. వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి జయసింహరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, పీడీలు విశ్వప్రసాద్, అంజయ్య, బాబలక్ష్మి, గంగసాగర్, శేఖర్, మధులిక పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ మండల స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించినట్లు ఎంఈవో రాఘవులు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 800 మీటర్లు, 30 మీటర్ల రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, షటిల్ రన్‌లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రాజశేఖర్, పీడీలు పాల్గొన్నారు.

●కథలాపూర్: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన క్రీడా పాఠశాల ఎంపిక పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయినట్లు మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో రాణించిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడ పాఠశాలకు ఎంపిక యినట్లు ఆయన తెలిపారు. క్రీడా పోటీలలో భూషన్‌రావుపేట పాఠశాలకు చెందిన అనన్య, కథలాపూర్ పాఠశాలకు చెందిన చల్ల యేజితలు జిల్లా క్రీడా పాఠశాలకు ఎంపికయినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

గొల్లపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలన కాలంలో నిరుపేదలకు రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీలు గుప్పించి మొండిచెయ్యి చూపారని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకుని లబ్ధిపొందాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలభక్తుల కిషన్, నాయకులు కొండ్ర గంగారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్ కుమార్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీనారే కళ్యాణ భవనంలో బుధవారం కోరుట్ల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఓబీసీ సెల్ కన్వీనర్ కత్తి వెంకట స్వామి, జగిత్యాల జిల్లా పార్టీ కో ఆర్డినేటర్ అంజన్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాతో పాటు మండల , పట్టణాల స్థాయి పదవుల ఆశీస్తున్న వారి నుండి వెంకట స్వామి, అంజన్‌కుమార్ దరఖాస్తులను స్వీకరించారు.

అన్నదాతల ఖాతాల్లోకి 'రైతు భరోసా'

(5వ పేజీ తరువాయి)

గతంలో మాదిరిగా కొంత మందికి జమ చేస్తుందా అన్న చర్చలు అన్నదాతల్లో జరుగుతున్నాయి. 2024 సంవత్సరం యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,25,782 మంది రైతులకు గాను రూ.23,34,684,671 పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. ఇందులో జిల్లా వ్యాప్తంగా 1,80,914 మంది రైతులకు రూ.124,78,72,746లను ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లోనైనా సాగులో ఉన్న రైతులందరికీ భరోసా జమ చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

-రాజారెడ్డి, రైతు, తిమ్మాపూర్



నాకు మూడెకరాల పొలం ఉంది. పంట పెట్టుబడులు పెట్టే సమయంలో ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు అందించడం సంతోషంగా ఉంది. రైతులకు కొంత భారం తగ్గుతుంది. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

సంతోషంగా ఉంది..

-భీమయ్య, రైతు, సారంగాపూర్



వానాకాలం పంటల సాగుకు ప్రభుతం పెట్టుబడి సాయం అందించి భరోసా కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. పంట పెట్టుబడికి ప్రభుత్వం అందించే డబ్బులు ఉపయోగపడతాయి. ఈ డబ్బులతోనే పనులు మొదలుపెడతా.

జిల్లాలో 2,48,550 మంది రైతులకు లబ్ధి

-భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



జిల్లా వ్యాప్తంగా 2,48,550 మందికి రైతు భరోసా కింద వానాకాలం పెట్టుబడి సాయం సుమారు రూ.251 కోట్లు జమ కానున్నాయి. ప్రభుత్వం రెండు రోజుల నుంచి రైతు భరోసా అందిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పెట్టుబడి సాయం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

వైభవంగా నాగవెల్లి పట్నాలు


నాగవెల్లి పట్నం వద్ద భక్తులు

పెగడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం నాగవెల్లి పట్నాలు వైభవంగా నిర్వహిం చారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆరు రోజులుగా జరుగు తున్న బీరప్ప ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో నాగవెల్లి పట్నం ముగ్గు వేసి మొక్కులు చెల్లించు కున్నారు. ఈసందర్భంగా అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

'అంగన్‌వాడీ టీచర్‌పై దాడి సరికాదు'

మల్యాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ బద్దం లక్ష్మిపై యువకుడు దాడి చేయడం సరికాదని అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు కళావతి, అనురాధ, స్వరూపరాణీ తదితరులు కోరారు.

ఇంటి పన్నులు తగ్గించాలని వినతి

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులు (నాలుగింతలు) వెంటనే తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులు కమీషనర్ కల్లెడ రాజశేఖర్‌కు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి పన్నులు అధికంగా పెంచినట్లు తెలిపారు. వెంటనే ఇంటి పన్నులు తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ వైస్‌చైర్మన్ రామయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి ఆర్వోఆర్-25 నూతన రెవెన్యూ చట్టం పై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కట్కం వరందన్ పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో భూభారతి ఆర్వోఆర్-25 నూతన రెవెన్యూ చట్టం పై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలిచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికై ఇచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. సాదాబైనామా, భూమి విస్తీర్ణ సవరణ, మిస్సింగ్ సర్వే నెంబర్లు వంటి పై అధికంగా ప్రజలనుంచి దరఖాస్తులు వస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా, రెవెన్యూ సదస్సులో భాగంగా గ్రామానికి వచ్చిన తహసీల్దార్‌ను, రెవెన్యూ అధికారులను ఏఎంసీ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ ఎంపీటీసీ లంభ ధనవ్వలక్ష్మణ్, అర్ఐ అనూష, ఏఎస్వో ప్రశాంతి, సిబ్బంది మమత, మమత, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నా భర్త మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించండి

● ప్రభుత్వానికి మృతుడి భార్య వేడుకోలు


ప్రభుత్వాన్ని వేడుకుంటున్న రవీందర్ భార్య విజయలక్ష్మి, కుమారుడు

జగిత్యాల అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్‌లో చనిపోయిన తన భర్త రెవెల్ల రవీందర్ (48) మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించాలని జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. బతుకు దెరువు కోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రెవెల్ల రవీందర్ (48) అనే వ్యక్తి ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ఇజ్రాయిల్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న యుద్ధం వల్ల ఎక్కడా పని దొరక్క పోవడంతో పాటు అనారోగ్యానికి గురై వైద్యం అందక తన భర్త మృతి చెందాడని రవీందర్ భార్య విజయలక్ష్మి రోదిస్తూ తెలిపింది. రవీందర్ రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం ఇజ్రాయిల్ వెళ్లాడు. కాగా ఇజ్రాయిల్‌లోని రమాత్‌గాన్ పట్టణంలో ఓ గదిలో ఉంటున్న రవీందర్ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించాడని అతడితో కలిసి గదిలో ఉంటున్న వారు కుటుంబ సభ్యులకు మంగళవారం సమాచారం అందించారు. కాగా మృతుడికి కూతురు ఆకాంక్ష, కుమారుడు అమర్‌నాథ్ ఉన్నారు. మూగవాడైన నా కొడుకును ఎలాగైనా ఉన్నత స్థానంలో ఉంచాలనే తపనతో ఇజ్రాయిల్ వెళ్లిన నా భర్త రవీందర్ మా కుటుంబాన్ని అనాథలను చేసి తిరిగి రాని లోకాలకు వెళ్ళి పోయాడని రవీందర్ భార్య విజయలక్ష్మి రోదించింది. నా భర్తను కడసారి చూసేందుకైనా మృత దేహాన్ని త్వరగా తెప్పించాలని రవీందర్ భార్య విజయలక్ష్మి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నేత జువ్వాడి

మల్లాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ళను త్వరగా నిర్మించుకోవాలని వెంటనే గృహ ప్రవేశాలు జరుపు కోవాలని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్చి జువ్వాడి నర్సింగా రావు అన్నారు. బుధవారం జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు జలపతిరెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దిదారులు వెంటనే ఇళ్ళ నిర్మాణం చేపట్టడం ద్వారా నిధుల మంజూరు త్వరగా అవుతాయన్నారు.అనంతరం ఆయన ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద మంజూరు అయిన పనులకు శంఖుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రేస్ పార్టీ నాయకులు నల్ల రాజన్న, పుష్ప లత, నర్సయ్య, నారాయణ రెడ్డి, నూతిపెల్లి రాజం, శ్రీనివాస్ రెడ్డి, అనంద్ గౌడ్, రవీందర్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు పత్రాలు పంపిణీ

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాజారం, నేరెళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన వారికి అందించడం జరిగిందని తెలిపారు. రాజారంలో 20 మందికి ఇళ్ల, నేరెళ్లలో 43 మందికి ఇళ్ల మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. లబ్దిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణ పనుల చేపట్టి పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజారం మాజీ సర్పంచ్ రంగు మమత-అశోక్, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి జాజాల రమేష్, గ్రామపంచాయితీ కార్యదర్శులు నరేష్, రాజు, ఆలయ ధర్మకర్త ఏదులాపురం మహేందర్, గునిశెట్టి కాశీనాథం, ఐత రత్నాకర్, కాసారపు బాలగౌడ్, జాజాల రమేష్, మెరుగు రమేష్, జుంజురు అశోక్, ఇంద్రాల మల్లేశం, రాజారపు రాజేశం, తిరుపతి, లక్ష్మణ్, మల్లేశం, నారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల సమస్యల పరిష్కారం కొరకు తెలంగాన ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పనిచేస్తుందని రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కోరుట్ల డివిజన్ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వయోదికుల వేదింపుల నివారణ దినోత్స వ వేడుకలను నిర్వహించి సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పబ్బాశివానం, గంగారాం, గంటేడి రాజ్ మోహన్, సైపోద్దిన్, రాజయ్య పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తాం'

కథలాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించే విధంగా ప్రతికార్యకర్త కృషి చేయాలని వేములవాడ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా పార్టీ అధ్యక్షుడు న్యాతనవీన్ పాల్గొ న్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు వంశీ కాశవత్రి, అంబటి రాదాకృష్ణ, అర్జుణ్, రాదారపు సాయితేజ, ఆకుల సంతోష్, ముద్రకోలా అనిల్, మనత్తుల మహిపాల్, జంగా రంజిత్, అమెటా ప్రేమ్, మధురెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ధర్మపురి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో బుధవారం నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో ధర్మపురి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నూతనవిద్యుత్ స్తంభాలు ఏర్పాటుకోసం రూ26లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలు ముల లావణ్య, ట్రాన్స్‌కో ఏడీఈ సింధూ రశర్మ, ఏఈ రవి, మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

● మండల వ్యవసాయ అధికారి జ్యోతి

కొడిమ్యాల, జూన్18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన బీటీ 3 పత్తి విత్తనాలు విత్తి రైతులు తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి అన్నారు. బుధవారం ఏవో విలేకరులతో మాట్లాడుతూ గడ్డిమందు గ్లైఫోసెట్ స్ప్రే చేసె లూజు పత్తి విత్తనాలను అపరిచిత వ్యక్తుల వద్ద కొనుగోలు చేయవద్దన్నారు. ఎవ్వ రైనా ఎలాంటి లూజు విత్తనాలు ఎక్కువ దిగుబడి వస్తుందని నమ్మించి రైతులకు అంటగట్టె ప్రయత్నం చేస్తె పోలీసులకు, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాన్నారు. మార్కెట్‌లో ప్రభుత్వ అనుమతి పొందిన రకరకాల విత్తనాలను అనుమతి పొందిన డీలర్ల వద్దనె కొనుగోలు చేయాలన్నారు. పంట కాలం పూర్తయ్యె వరకు విత్తనాల రసీదును భద్రపర్చుకోవాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్లు

కోరుట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల, మల్లాపూర్ మండలాలకు తహసీల్దార్లుగా బాధ్యతలు స్వీకరించి కృష్ణ చైతన్య, రమేష్‌లు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని మార్యద పూర్వకంగా కలిసారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్యద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'


పాషిగామలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

వెల్గటూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ శాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం వెల్గటూర్ మండలంలోని పాశి గామ ప్రాథమిక పాఠశాల, కిషన్‌రావుపేట లోని ప్రాథమి కోన్నత పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాషిగామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చేపట్టిన వినూత్న కార్యక్రమాల వలన విద్యార్థుల నమోదు పెరగడం అభినందనీయమన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నందయ్య మాట్లాడుతూ అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించడం ఉపాధ్యాయుల అంకితభా వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు నీలం సంపత్, నర్మల గంగన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సత్యవతి, ఆలయ కమిటీ చైర్మన్ బరుపటి జనార్ధన్, ఉపాధ్యాయులు మహేష్, భవాని, మునీంద్ర, వనిత, శిరీష సీఆర్పీ వెంకటేష్, తల్లిదండ్రులు, యువజనసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

కొడిమ్యాల : మండలంలోని నమిలికొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో బాగంగా చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ప్రీ స్కూల్ మెటీరియల్ పిల్లలకు త్వరగా అర్థమయ్యేలా రూపొందించబడిందన్నారు. చిన్నారులను ప్రైవేటు స్కూల్‌కు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుంధతి, సుమలత, వసంత, కల్పన, తల్లులు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.